
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 22 వ భాగం

## హిరణ్యకశిపుడు, ప్రహ్లాద చరిత్ర – 4

క్రితం వ్యాసంలో తండ్రి ప్రహ్లాదుణ్ణి చంపేయమని చెప్పాడని చూశాం. వీణ్ణి తీసుకెళ్ళి శూలాల్తో పొడవడం, పాముల్తో కరిపించడం, ఏనుగులతో తొక్కించడం అవీ చేస్తున్నారు ఇప్పుడు.

చ. పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రమున్
ఒలియదు లోపలన్ రుధిర ముబ్బదు కందదు శల్యసంఘమున్
నలియదు దృష్టివైభవము నష్టము గాదు ముఖేందుకాంతియుం
బొలియదు నూతనశ్రమము పుట్టదు పట్టదు దీనభావమున్. [7-192]

వాళ్లు పొడుస్తూంటే కుర్రాడి ఒళ్ళు చిట్లదు. రక్తం కారదు, ఎముకలు విరగవు. మొహంలో కాంతి పోదు.

ఉ. తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి కో!
పన్నగశాయి! యో! దనుజభంజన! యో! జగదీశ! యో! మహా
పన్నశరణ్య! యో! నిఖిలపావన! యంచు నుతించుఁ గాని తాఁ
గన్నుల నీరు దేఁడు భయకంపసమేతుఁడు గాఁడు భూవరా! [7-193]

ఇన్ని కష్టాలు పెట్టినా, ఓ పన్నగశాయి, ఓ జగదీశ అంటాడే గానీ ఏడవడం గానీ తనని కష్టపెట్టేవాళ్ళనీ వీటన్నింటికీ కారణమైన తండ్రినీ తిట్టుకోవడం కానీ లేదు. ఎందుకిలా చేస్తున్నాడని ఆలోచిద్దాం ఒకసారి. దార్లో నడుస్తూంటే కాల్లో ముల్లు దిగిందనుకోండి వెంఠనే ఇది ఎవరు పడేసారో వాళ్లనీ, ముల్లునీ, రోడ్లు శుభ్రం చేయని ప్రభుత్వాన్నీ, అక్కడ్నుంచి మనకి తోచినవాళ్ళందర్నీ తిట్టుకోవడం కదా మనందరి ఆచారం? ఇక్కడ ప్రహ్లాదుడు మరి ఎవర్నీ తిట్టడేం? దీనికో చిన్న కథ చెప్పుకుందాం.

రమణ మహర్షి ఆశ్రమం చాలా చిన్నదిగా ఉన్నప్పుడు, అంటే మహర్షీ, ఇద్దరు ముగ్గురు శిష్యులు మాత్రమే ఉన్నప్పుడు, ఓ సారి దొంగలు పడ్డారుట రాత్రి. ఆశ్రమంలో ఏవో డబ్బులు దాచి ఉంచారని దొంగల అనుమానం. నిద్రపోతున్న అందర్నీ – మహర్షితో సహా – లేపి డబ్బులెక్కడ ఉన్నాయో చూపించమని గొడవ పెట్టారుట. అబ్బే నేను రోజూ కొండదిగి బిచ్చమెత్తే సాధువుని, నాదగ్గిరేమీ లేదు అని చెప్పినా నమ్మరే. కాసేపు అడిగిచూసాక ఇంక ఇదిగాదు పద్ధతి అని కర్ర తీసుకుని మహర్షినీ, శిష్యులని కొట్టడం మొదలు పెట్టారుట.

ఎంత కొట్టినా మా దగ్గిర ఏమీ లేదనే సమాధానమే తప్ప ఇంకేమీ రాక ఆఖరికి దొంగలు పారిపోయేరుట. దొంగలు అలా కొడుతున్నప్పుడు ఒక శిష్యుడు తిరగబడదామను కుంటూంటే మహర్షి కళ్ళతోనే వారించారని చెప్తారు.

ఇది జరిగిన కొంతకాలానికి దొంగల్ని పోలీసులు పట్టుకుని మహర్షి దగ్గిరకి తీసుకొచ్చారుట – వీళ్ళేనా మిమ్మల్ని కొట్టింది అని అడగడానికి. మహర్షి చెప్పేరుట, "అప్పుడెప్పుడో ఎవరో దొంగలు పడ్డారు నిజమే, ఎవరో మర్చిపోయాను. వాళ్ళు ఎవరో నాకు గుర్తు లేదు" అని. బ్రహ్మ జ్ఞానం కలిగిన రమణ మహర్షి అలా అన్నారంటే నమ్మగలమా? ఆ జ్ఞానం కలిగాక అనేక జన్మలలో తాను ఎవరో, ఎందుకా జన్మ ఎత్తవల్సి వచ్చిందో అవన్నీ తెలుస్తాయి కదా? కానీ మహర్షి గుర్తు లేదని అనడం ఏమిటి? మరి ఎందుకలా అన్నారో?

ఓ పని చేస్తాం. దానివల్ల వచ్చే ఫలితం మంచిదనుకోండి. మళ్ళీ చేయాలనిపిస్తుంది. కానీ అన్నిసార్లూ మంచి ఫలితం వస్తుందని కానీ, రావాలని కానీ లేదు. ఫలితం చెడ్డదైతే? ఎందుకు చేసాంరా దేవుడా అనిపిస్తుంది. కానీ మంచైనా చెడైనా ఫలితం అనుభవించవల్సిందే కదా? ఏదో జన్మలో చేసుకున్న పాపం వల్ల ఈ జన్మలో ఆ దొంగలు వచ్చి కొట్టేరు. ఆ రుణం, కర్మా అలా తీరిపోయేయి. హమ్మయ్యా దరిద్రం వదిలింది అని మహర్షి సంతోషించి ఉంటారు. ఇప్పుడు వీళ్ళని గుర్తుపడితే పోలిసులు వాళ్ళనేం చేస్తారో ఊహించడం అంత కష్టం కాదు. అంటే గుర్తుపడితే చాలు వాళ్ళకి శిక్ష పడడానికి. అప్పుడు మహర్షికి వాళ్ళకి పడే శిక్ష తాలూకు కర్మ అంటుకుంటుంది – తాను గుర్తుపట్టి శిక్షకి దోహదం చేసారు కనక. దాన్ని తీర్చుకోవడం కోసం ఇంకో జన్మ ఎత్తవల్సి రావొచ్చు. ఇప్పటిదాకా తపస్సు చేసి మోక్షం సంపాదించేక మళ్ళీ చీమూ నెత్తురూ, అనేకానేక శారీరక, మనో అశుద్ధాలూ కలగలపిన ఇంకో జన్మ ఎత్తీ మళ్ళీ ఎటువంటి కష్టాలు పడాలో? ఇంత కష్టపడి సంపాదించిన బ్రహ్మ జ్ఞానం, జన్మ రాహిత్యం – ఒక్క దొంగల్ని గుర్తు పట్టడం అన్న దానితో — గంగలో కల్సిపోతున్నాయి. ఎందుకొచ్చిన తంటా? ఎవరు మాత్రం ఒప్పుకుంటారు? భగవద్గీత లో ఈ శ్లోకం చూడండి.

తేజక్షమా ధృతిః శౌచం అద్రోహోనాతిమానితా
భవంతి సంపదం దైవీం అభిజాతస్య భారత (16-3)

ఇటువంటి దైవీ సంపదలు ఉన్నాయి కాబట్టి ఆయన మహర్షి. చిన్న వయసులోనే ఆ జ్ఞానం అబ్బింది కనకనే మహావిష్ణువు ఒక అవతారం ఎత్తి మరీ కనిపించాడు ప్రహ్లాదుడికి.

వ. ఇట్లు సర్వాత్మకంబై యిట్టి దట్టిదని నిర్దేశింప రాని పరబ్రహ్మంబు దానయై యమ్మహావిష్ణుని యందుఁ జిత్తంబుజేర్చి తన్మయుండయి పరమానందంబునం బొంది యున్న ప్రహ్లాదుని యందు రాక్షసేంద్రుండు దన కింకరులచేతం జేయించుచున్న మారణకర్మంబులు పాపకర్ముని యందుఁ బ్రయుక్తంబు లైన సత్కారంబులుం బోలె విఫలంబులగుటం జూచి.

[7-195]

ప్రహ్లాదుడి మనస్సు ఇన్ని కష్టాల్లోను ఎక్కడుంది? "ఇట్లు సర్వాత్మకంబై యిట్టి దట్టిదని నిర్దేశింప రాని పరబ్రహ్మంబు దానయై యమ్మహావిష్ణుని యందుఁ జిత్తంబుజేర్చి.." పరబ్రహ్మము ఇటువంటిదీ అని చెప్పడం కుదరదు కదా? అవ్యక్తమైనదాన్ని ఇదీ అని ఎలా చెప్పగలం? ప్రహ్లాదుడు ఇన్ని కష్టాల్లో కూడా దాదాపు అంబరీషుడిలాగే ఉన్నాడు, "చిత్తము మధురిపు శ్రీపాదములయంద..."

ఉ. ముంచితి వార్ధులన్, గదల మొత్తితి, శైలతటంబులందు ద్రో
బ్బించితి, శస్త్రరాజిఁ బొడిపించితి, మీఁద నిభేంద్రపంక్తి ఱొ
ప్పించితి; ధిక్కరించితి; శపించితి; ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితిఁ; బెక్కుపాట్ల నలయించితిఁ; జావఁ డి దేమి చిత్రమో [7-201]

చ. ఎఱుఁగఁడు జీవనౌషధము; లెవ్వరు భర్తలు లేరు; బాధలం
దఱలఁడు నైజ తేజమునఁ; దథ్యము జాడ్యము లేదు; మిక్కిలిన్
మెఱయుచు నున్నవాఁ; డొక నిమేషము దైన్యము నొందఁ డింక నే
తెఱఁగునఁ ద్రుంతు? వేసరితి; దివ్యము వీని ప్రభావ మెట్టిదో? [7-202]

ఇప్పుడు తండ్రి అనుకుంటున్నాడు, "వీణ్ణి పాములచేత కరిపించాను. కొండలమీదనుంచి తోసారు. ఏమిచేసినా చావడేమిటో ఈ విచిత్రం?" ఇన్ని కష్టాలలోనూ ఎవరూ ఓర్చేవాళ్ళు లేరు వీడికి. అన్నింటికన్నా విచిత్రం ఒక్క నిముషమైనా దైన్యం పొందడు వీటివల్ల. ఈ స్తితిలో ప్రహ్లాదుడిలా ఉంటే కష్టాలు పెట్టే తండ్రికి ఒళ్ళు జలదరిస్తోంది.

గాంధీ గారు సత్యాగ్రహం చేస్తూంటే అప్పటి పాలకులకి ఇలాగే దిగులొచ్చేదిట. ఈయన ఏం కొంపలు ముంచుతాడో అని. చివరకి రవి అస్తమించని సామ్రాజ్యం ముక్క ముక్కలై ఇప్పుడు ప్రపంచ పటంలో కళ్ళు చికిలించి చూస్తేనే కాని కనబడని స్తితిలోకి వచ్చింది కదా? గాంధీగారు శారీరకంగా ఎంతటి మహా బలుడో, సంపన్నుడో మనకి తెల్సిందే. ఓ గావంచా కట్టుకుని భుజం మీద తువ్వాలుతో, చిన్న గాలి వీస్తే కిందపడిపోయేటట్టు ఉండే ఆయన మొత్తం సామ్రాజ్యాన్ని గడగడలాడించాడు కదా? అంటే ఎన్ని వరాలు సంపాదించి శారీరకంగా ఎంత బలం, సంపదా పోగేసుకున్నా అది చివరకి ఎందుకూ పనికిరాదు. ఇక్కడ హిరణ్యకశిపుడికి అదే జరుగుతోంది.

వ. కావున వీఁడు మహాప్రభావసంపన్నుండు వీనికెందును భయంబు లేదు; వీనితోడి విరోధంబునం దనకు మృత్యువు సిద్ధించునని నిర్ణయించి చిన్నఁబోయి ఖిన్నుండై ప్రసన్నుండు గాక క్రిందు జూచుచు విషణ్ణుండై చింతనంబు జేయుచున్న రాజునకు మంతనంబునఁ జండామార్కు లి ట్లనిరి. [7-205]

వీడు మామూలు కొడుకుకాదు. వీడివల్ల తనకి మృత్యువు వస్తుందనేది నిజమైనట్టు తోస్తోంది అనుకుని మనసులో క్షోభించడం చూసి చండామార్కులు చెప్తున్నారు. వాళ్ళకేం? వాళ్ళు రాక్షస గురువులు; రాజుగారికి భజన చేయడం వాళ్ళ విధి కదా?

శా. శుభ్రఖ్యాతివి నీ ప్రతాపము మహాచోద్యంబు దైత్యేంద్ర! రో
షభ్రూయుగ్మవిజృంభణంబున దిగీశవ్రాతముం బోరులన్

విభ్రాంతంబుగఁ జేసి యేలితి గదా విశ్వంబు వీఁ డెంత? యీ
దభ్రోక్తుల్ గుణదోషహేతువులు చింతం బొంద నీ కేటికిన్? [7-206]

నీ ఖ్యాతి ఎటువంటిది? నువ్వు జగదేకవీరుడివి కదా? అయిదేళ్ళ కుర్రాడు వీడెంత? మేము తీసుకెళ్ళి చెప్పిచూస్తాం. నువ్వేం కంగారు పడకు అని చెప్పి మళ్ళీ తీసుకొచ్చేరు గురుకులానికి. గురుకులానికి వచ్చాక చండామార్కులు చుట్టుపక్కలలేనప్పుడు

క. ఆటలకుఁ దన్ను రమ్మని
పాటించి నిశాటసుతులు భాషించిన దో
షాటకులేంద్రకుమారుఁడు
పాటవమున వారిఁ జీరి ప్రజ్ఞాన్వితుఁడై. [7-209]

క. చెప్పఁ డొక చదువు మంచిది
చెప్పెడిఁ దగులములు చెవులు చిందఱ గొనఁగాఁ
జెప్పెడు మన యెడ నొజ్జలు
చెప్పెద నొక చదువు వినుఁడు చిత్తము లలరన్. [7-210]

తాను హరి భక్తిలో మునిగి తేల్తున్నాడు సరే, కూడా ఉన్న పిల్లలు ఆడుకోవడానికి రమ్మంటూంటే ఇప్పుడు చుట్టూ ఉన్న కుర్రవాళ్ళకి అందరికీ ప్రహ్లాదుడు చెప్తున్నాడు. ఒరే అబ్బాయిలూ ఆడుకోవడం కాదు మనం చేయవల్సింది. హరి భక్తి తప్ప ఇంకేం కావాలి? మనకి ఈ గురువులు ఏవో చెప్తారు వాళ్ళకి తెల్సినవి. అవి మనకి ఎందుకూ కొరగావు. రండి అందరం శ్రీహరి భజన చేద్దాం అని. ఇలా అనేసరికి వాళ్ళందరికీ ఆశ్చర్యం వేసి ప్రహ్లాదుణ్ణి అడుగుతున్నారు.

ఉ. మంటిమి కూడి, భార్గవకుమారకులొద్ద ననేకశాస్త్రముల్
వింటిమి. లేఁడు సద్గురుఁడు వేఱొకఁ డెన్నఁడు, రాజశాల ము
క్కంటికి నైన రాదు చొరఁగా, వెలికిం జన రాదు, నీకు ని
ష్కంటకవృత్తి నెవ్వఁడు ప్రగల్భుఁడు చెప్పె? గుణాఢ్య! చెప్పుమా. [7-220]

ఇక్కడకి ఈ గురువులు తప్ప శివుడికైనా లోపలకి వచ్చే బయటకి వెళ్ళే దారి లేదు. వేరే గురువులు లేరు. వీళ్ళు నువ్వు చెప్పేవి ఏవీ చెప్పట్లేదు. నీకివన్నీ ఎలా తెలిసాయి?

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ
జిక్కఁడు దానముల శౌచశీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తిని

జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ! [7-243]

మన తల్లితండ్రులతోసహా అందరూ ఇక్కడ సంసారంలో ఈదుతున్నారు చూసారుగా? విషయ వాసనల్లో పడి ఉన్నవాళ్ళకి హరిభజన చేయడం కుదరదు, కుదిరినా మనసు ఒప్పదు. స్వతహాగా పూర్వ పుణ్యఫలం వల్ల కలగాలి. నేను మా అమ్మ కడుపులో ఉన్నప్పుడు ఇవన్నీ నారదుడు మా అమ్మకి చెప్తూంటే విన్నాను. మీకు కూడా నేర్పుతాను. వ్రతాలూ, క్రతువులూ, దానం, తపం ఇలాంటివన్నీ చేసినా చిక్కని శ్రీహరి భక్తికి అవలీలగా చిక్కుతాడు.

క. చాలదు భూదేవత్వము
చాలదు దేవత్వ మధిక శాంతత్వంబుం
జాలదు హరి మెప్పింప వి
శాలోద్యములార! భక్తి చాలిన భంగిన్. [7-244]

నారాయణుణ్ణి మెప్పించాలంటే దేవత్వం, బ్రాహ్మణత్వం ఇలాంటివి చాలవు. భక్తి ఒకటే చాలు.

క. గురువులు దమకును లోఁబడు
తెరువులు చెప్పెదరు విష్ణు దివ్యపదవికిం
దెరువులు చెప్పరు; చీఁకటిఁ
బరువులు పెట్టం గనేల బాలకులారా! [7-246]

ఇంక గురువుల సంగతి. వాళ్ళకొచ్చినవి వాళ్ళు చెపుతారు. మోక్షం ఎలా సంపాదించాలో వాళ్ళకి తెలిస్తే కదా చెప్పడానికి? విష్ణుపదం చేరేదారి వాళ్ళకి తెలియదు. చీకట్లో పరుగులు పెట్టడం వంటిదే వాళ్ళు చెప్పే చదువు.

వ. అని యిట్లు ప్రహ్లాదుండు రహస్యంబున న య్యైవేళల రాక్షస కుమారులకు నపవర్గమార్గం బెఱింగించిన; వారును గురుశిక్షితంబులైనచదువులు చాలించి నారాయణభక్తి చిత్తంబులం గీలించి యుండుటంజూచి వారల యేకాంతభావంబు దెలిసి వెఱచి వచ్చి శుక్రనందనుండు శక్రవైరి కిట్లనియె. [7-250]

అని ఇలా కుర్రవాళ్ళందర్నీ తనవైపుకి తిప్పుకుంటున్నాడు. దీనితో చండామార్కులవారు చేతులెత్తక తప్పలేదు. ఇప్పుడు ప్రహ్లాదుణ్ణి రాజుగారిదగ్గిరకి తీసుకొచ్చి చెప్తున్నారు మహాప్రభో మావల్ల కాదు అని.

శా. రక్షోబాలుర నెల్ల నీ కొడుకు చేరం జీరి లోలోన నా
శిక్షామార్గము లెల్ల గల్ల లని యాక్షేపించి తా నందఱన్

మోక్షాయత్తులఁ జేసినాఁడు మనకున్ మోసంబు వాటిల్లె; నీ
దక్షత్వంబునఁ జక్కఁజేయవలయున్ దైతేయవంశాగ్రణీ! [7-251]

మీ కుర్రాణ్ణి తీసుకెళ్ళి ఏదో నేర్పుదాం అనుకున్నాం, కానీ వీడెంతటివాడంటే, మేము చెప్పే చదువులన్నీ తప్పుల తడకలు అని తేల్చేసి మిగతా వాళ్ళందర్నీ కూడా మోక్షాయిత్తుల్ని చేసి నారాయణ స్మరణం చేయిస్తున్నాడు. మనకి మొదటికే మోసం వచ్చింది. ఇంక వీణ్ణి నువ్వే సరిచేసుకోవాలి.

క. ఉడుగఁడు మధురిపుకథనము
విడివడి జడుపగిదిఁ దిరుగు వికసనమున నే
నొడివిన నొడువులు నొడువఁడు
దుడుకనిఁ జదివింప మాకు దుర్లభ మధిపా! [7-253]

వీడేమో ఈ విష్ణుభక్తి వదలడు. ఇంక మేము చేయగలిగేది ఏమీలేదు. మీ ఇష్టం అనేసరికి హిరణ్యకశిపుడికి ఒళ్ళు కంపరం ఎత్తింది. కోపం ఎక్కువై ఇప్పుడు అంటున్నాడు.

వ. అని యిట్లు గురుసుతుండు చెప్పినఁ గొడుకువలని విరోధవ్యవహారంబులు గర్ణరంధ్రంబుల ఖడ్గప్రహారంబులయి సోఁకిన; బిట్టు మిట్టి పడి పాదాహతంబైన భుజంగంబు భంగిఁ బవనప్రేరితంబైన దవాన లంబు చందంబున దండతాడితంబయిన కంఠీరవంబుకైవడి భీషణరోషరసావేశ జాజ్వాల్యమానచిత్తుండును బుత్రసంహారోద్యోగాయత్తుండును గంపమానగాత్రుండును నరుణీకృతనేత్రుండును నై కొడుకును రప్పించి సమ్మానకృత్యంబులు దప్పించి నిర్దయుండై యశనిసంకాశ భాషణంబుల నదల్చుచు.
[7-255]

ఇక్కడ్నుంచి పోతన రాసిన తెలుగు వచనం చదవాలంటే నోరు తిరగడం కష్టం. ఎంతటి సహజ కవి అయినా భక్తి గురించి రాసేటప్పుడు సరళమైన భాషా (ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై ... ) రోషం కోపం గురించి రాసేటప్పుడు భీకరమైన తెలుగు (దండతాడితంబయిన కంఠీరవంబుకైవడి భీషణ రోష రసా వేశ జాజ్వాల్యమాన చిత్తుండును...) వాడడం పోతనకే దక్కుతుంది.

ఈ మాటలు చెవుల్లో శూలాలు పొడిచినట్టు అనిపించాయిట హిరణ్యకశిపుడికి. ఇప్పుడు రాబోయే ఘట్టానికా అన్నట్టు రాజుగారి స్థితి ఎలా ఉంది? "... బుత్రసంహారోద్యోగాయత్తుండును గంపమానగాత్రుండును నరుణీకృతనేత్రుండును నై" ప్రహ్లాదుణ్ణి రప్పించి గద్దించి అడుగుతున్నాడు.

శా. ప్రజ్ఞావంతులు లోకపాలకులు శుంభద్ద్వేషు లయ్యున్ మదీ
యాజ్ఞాభంగము చేయ నోడుదురు రోషాపాంగదృష్టిన్ వివే

కజ్ఞానచ్యుత మై జగత్త్రితయముం గంపించు నీ విట్టిచో
నాజ్ఞోల్లంఘన మెట్లు చేసితివి సాహంకారతన్ దుర్మతీ! [7-258]

లోకపాలకులు, వివేకం ఉన్నవాళ్ళు అందరూ కూడా ముల్లోకాలకీ రాజుని నేనే అని తెలిసి నోరుమూసుకుని నేను చెప్పినట్టు వింటున్నారు. నేనంటే త్రిలోకాలు కంపిస్తున్నాయి.అటువంటివాడి ఆజ్ఞల్ని నువ్వు ఎలా అతిక్రమిస్తున్నావు?

శా. ఆచార్యోక్తముగాక బాలురకు మోక్షాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు నీఱు చేసితివి మూఢాత్మ్ముం గులద్రోహినిన్
నీచుం జంపుట మేలు చంపి కులమున్ నిర్దోషముం జేసెదన్. [7-260]

పోనీ అక్కడ గురుకులంలో ఊరుకున్నావా అంటే అదీలేదు. నీతోటి కుర్రాళ్ళకి మోక్షాసక్తి పుట్టించి వాళ్ళనికూడా పాడుచేస్తున్నావు. నీలాంటి నీచుడు బతకడం కంటే చావడమే మేలు. నిన్ను చంపి రాక్షస కులానికి దోషం లేకుండా చేస్తాని అని గర్జించాడు.

ఇక్కడొక విషయం చూద్దాం, మనకి బాగా తెల్సిందే. మీకో ఇద్దరు పిల్లలున్నారనుకోండి. అందులో ఒకడు నేను సన్యాసం తీసుకుని ఆశ్రమంలో చేరతాను అన్నాడు. మీరేమంటారు? అసలు నిజంగా ఎంతమంది ఒప్పుకుంటారు? ఈ సంసారంలో ఎంత సుఖం ఉందో పీకదాకా దిగిన మనందరికీ తెలుసు కదా? ఇక్కడ సంసారం అంటే భార్యాభర్తల, పిల్లా పీచూ ఉండే కుటుంబ సంసారం కాదని గమనించాలి. జన్మించడం, పునరపి జననం పునరపి మరణం అనేదే అసలైన సంసారం. మనలో ఒకడు సన్యాసం తీసుకుని ఈ జనన మరణాల చట్రంలోంచి తప్పుకోవడానికి, మోక్షం కోసం ప్రయత్నం చేస్తాను అంటే (సన్యాసం తీసుకున్నవాడికి ఈ జన్మలోనే మోక్షం వస్తుందా రాదా అనే విషయం పక్కన పెడదాం ప్రస్తుతానికి) మనం ఎందుకు ఒప్పుకోలేకపోతున్నాం? అసలు ప్రయత్నమే చేయని మనకంటే ఆ సన్యాసం తీసుకోబోయే అతని మోక్షం గురించి ఆలోచనలు, ముముక్షత్వం మంచివే కదా? మోక్షాసక్తి ఉన్నవాణ్ణి సంసారంలోకి ఎందుకు లాగాలని చూస్తున్నాం? ఒకసారి అవలోకనం చేసుకుంటే ఈ విషయంలో మనం కూడా హిరణ్యకశిపుడిలాంటి వారమే అని అర్థం అవుతుంది.

వచ్చే వ్యాసంలో హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు వినయంగా నచ్చచెప్పడం, వాడింకా రెచ్చిపోయి చావు కొనితెచ్చుకోవడం చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS